సాక్షి ప్రకాశం

బుధవారం । 26 । జూన్ । 2024



పొగాకు ధరల మోత

ఈ ఏడాది పొగాకు వేలంలో ధరల మోత మోగుతోంది. గరిష్ట ధరలు నానాటికీ పెరుగుతున్నాయి. సరాసరి ధరలు కూడా గతం కన్నా మెరుగ్గా ఉన్నాయి.

- 8లో..



యూపీ యువకుడి దారుణ హత్య

పనుల కోసం ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన ఓ యువకుడు ఒంగోలులో దారుణ హత్యకు గురయ్యాడు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
38.5/28.7

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు

న్యూస్‌రీల్

29న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు: జిల్లా సర్వసభ్య సమావేశం ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో కె.మాధురి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక దక్షిణ బైపాస్‌రోడ్డులోని పాత జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీపీలతోపాటు గౌరవ సభ్యులు, అన్ని విభాగాల అధికారులు సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు కాంస్య పతకం



జంపాని జగదీశ్వర్

ఒంగోలు: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు కాంస్య పతకం లభించిందని ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ముఖ్య కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం కటక్ పట్టణం జవహర్‌లాల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 6వ చైల్డ్ (అండర్ 10) బాలబాలికల విభాగంలో ఒంగోలుకు చెందిన జంపాని జగదీశ్వర్ వ్యక్తిగత విభాగం (ఫాయిల్ విభాగం)లో బ్రాంజ్ మెడల్ సాధించాడన్నారు. ఈ సందర్భంగా ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ అసోసియేషన్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఫెన్సింగ్ క్రీడలో వేలమంది విద్యార్థినీ విద్యార్థులకు శిక్షణను ఇచ్చి ఉన్నత స్థాయిలో ఉండేలా కృషి చేశామన్నారు. ప్రకాశం జిల్లాకు జాతీయ స్థాయిలో పతకం సాధించిన జంపాని జగదీశ్వర్, కోచ్ డి.రాజులను ఈ సందర్భంగా వి.నాగేశ్వరరావు అభినందించారు.

1962 పశు సంచార అంబులెన్స్ వాహనాల్లో ఉద్యోగ అవకాశాలు

టంగుటూరు: జిల్లాలో 1962 పశు సంచార అంబులెన్సు వాహనాలకు సంబంధించి ఖాళీగా ఉన్న పైలెట్ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ నెమలి శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాల భర్తీలో భాగంగా పైలెట్ పోస్టుకి పదో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండి హెవీ లైసెన్సు లేదా బ్యాడ్జి లైసెన్సు ఉండాలి. 40 సంవత్సరాలు వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ ఒంగోలు బస్టాండ్ సమీపంలో ఉన్న పశుసంవర్ధక శాఖ జేడీ ఆఫీసులో 1962 కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అభ్యర్థులు మరిన్ని వివరాలకు ఫోను 9704165512 నంబరుకు సంప్రదించాలని కోరారు.

వీఎల్‌ఓలకు గజిటెట్ హోదా కల్పించాలి

- ఏపీఎన్‌జీవీఎఫ్ రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ సేవా నాయక్
- ఫెడరేషన్ సమావేశ మందిరం ప్రారంభం



మాట్లాడుతున్న రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ సేవా నాయక్

ఒంగోలు సెంట్రల్: వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారులు (వీఎల్‌ఓ)లకు గజిటెట్ హోదా కల్పించాలని ఆంధ్రప్రదేశ్ నాట్ గజిటెట్ వెటర్నరీ ఫెడరేషన్ (ఏపీఎన్‌జీవీఎఫ్) రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ సేవా నాయక్ కోరారు. సంతపేట పశు వైద్యశాల ఆవరణలో మంగళవారం ఫెడరేషన్ సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ఫెడరేషన్ చైర్మన్ టీవీ రమేష్‌బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ సమావేశ మందిరాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ పశువైద్య సహాయకులు వ్యాక్సినేషన్‌తో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు వారికి అందిస్తున్న నగదును వారికి ప్రత్యేక ఐడీలు ఏర్పాటు చేసి అందులో నేరుగా డీబీటీ ద్వారా అందించాలని కోరారు. పారా వెటర్నరీ కౌన్సిల్ యాప్‌లో ప్రతి ఒక్కరూ నమోదు కావాలని చెప్పారు. వీఏ, ఎల్ఎస్ఏ, జేవీఓ, వీఎల్‌ఓల ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించి పలు సమస్యలపై చర్చించారు. రాష్ట్ర జేవీవో, వీఎల్‌ఓ ప్రధాన కార్యదర్శి జీ రామకృష్ణ, రాష్ట్ర ఫెడరేషన్ సెక్రటరీ బోనం గోవింద రాజులు, రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ అసోసియేషన్ ప్రసిడెంట్ రాఘవ, వెటర్నరీ అసిస్టెంట్ అసోసియేషన్ సెక్రటరీ రాకేష్, మాజీ చైర్మన్ లక్ష్మయ్య, మూడు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు మునసూరి కోటేశ్వర రావు, క్రిష్ణాంజనేయులు, పీ రవిచంద్ర కుమార్, శంకర్ రావు, చరణ్ కుమార్, జిల్లా పారా వెటర్నరీ సభ్యులు పాల్గొన్నారు.

పెరిగిన రుణ పరపతి

రైతులకు సాగు సమయంలో అవసరమయ్యే పెట్టుబడి సాయం కోసం ఏటా బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తారు. ఈ ఏడాది స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ బ్యాంకులకు చేరడంలో జాప్యంతో రుణాల పంపిణీ ఇంత వరకు మొదలుకాలేదు. వివిధ పంటలకు రుణ పరపతిని ఖరారు చేస్తూ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ఎట్టకేలకు ఆదేశాలిచ్చింది. గత ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఈ ఏడాది రైతులకు రుణపరపతి పెరిగింది. ఇకనైనా రుణాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

- ఖరారైన పంట రుణాల పరిమితి
- బ్యాంకులకు చేరిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నివేదిక
- వరికి గరిష్టంగా రూ.46 వేలు
- మిగిలిన పంటలకు ఇదే రకంగా రుణ పరపతి పెంపు
- ఖరీఫ్‌లో రూ.18,659 కోట్ల మేర రుణాలు

ఒంగోలు సెంట్రల్: ఎట్టకేలకు పంట రుణాల పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖరారైంది. స్కేల్ ఆఫ్ ఫైనాల్స్ నివేదిక బ్యాంకులకు చేరింది. పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది మార్చి నెలలోనే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు టెక్నికల్ కమిటీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ణయించింది. ఈ నివేదికను రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపారు. దానిని సవరించి ఆమోదించి జిల్లాకు పంపగా ఈనెల 18న ఆమోదం తెలపటంతో జిల్లా సహకార బ్యాంకు సీఈఓ, ఎల్‌డీఎంల ద్వారా అన్ని బ్యాంకులకు పంపారు. గత ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఈఏడాది రైతులకు రుణపరిమితి పెరిగింది. అయితే ఈ ఏడాది స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ బ్యాంకులకు చేరటంలో ఆలస్యం కావటంతో పంట రుణాల పంపిణీ చేపట్టలేదు. కొన్ని బ్యాంకులు పంట రుణాలను రెన్యువల్ చేయటం వరకే పరిమితమయ్యాయి. కలెక్టర్, జిల్లా వ్యవసాయ యంత్రాంగం చొరవ తీసుకుని పంట రుణాల పంపిణీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.



తాళ్లూరు మండలంలో బోర్ల ద్వారా ఖరీఫ్‌లో సాగు చేసిన వరి

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు, కౌలుదారులకు కలిపి రూ.18,659 కోట్ల మేర రుణాలు అందించాలని జిల్లా బ్యాంకర్స్ కమిటీ (డీఎల్‌బీసీ) నిర్ణయించారు.

రుణాల మంజూరు ఇలా..

రుణాలు రకం	లక్ష్యం రూ.కోట్లలో
క్రాప్ రుణాలు	13,863
టర్మ్‌లోన్స్ అగ్రిసంబంధిత	4283
కౌలు రుణాలు	513
మొత్తం రుణ లక్ష్యం	18,659



తూర్పుగంగవరం యూనియన్ బ్యాంకులో ఆరా తీస్తున్న రైతులు

పంట రుణాల పరిమితి వివరాలు ఇలా..

పంట పేరు	స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎకరాకు రూ.
వరి	42,000 – 46,000
వరి విత్తనోత్పత్తి	50,000
కంది	19,000 – 22,000
మినుము	20,000 – 22,000
శనగ	31,000 – 34,000
కొర్ర	14,000 – 15,000
పసుపు	1,00,000 – 1,10,000
ఆముదం	18,000 – 20,000
మల్బరీ	1,00,000 – 1,10,000
సోయాబీన్	12,000 – 15,000
క్యారెట్	30,000 – 35,000
మామిడి	45,000 – 50,000
అరటి టిష్యూకల్చర్	1,15,000 – 1,30,000
వేరు శనగ	31,000 – 35,000
వేరు శనగ (నీటి పారుదల)	35,000 – 38,000
జొన్న (వర్షాధారం)	19,000 – 22,000
పత్తి హైబ్రిడ్ (వర్షాధారం)	42,000 – 46,000
పత్తి (నీటి ఆధారం)	44,000 – 50,000
పత్తి విత్తనోత్పత్తి (ప్యాకెట్)	1,43,000 – 1,54,000
పచ్చి మిరప (వర్షా/నీటి)	90,000 – 95,000
ఎండు మిరప (వర్షా/నీటి)	1,15,000 – 1,25,000
పొగాకు	38,0000 – 42,000
ఉల్లి	55,000 – 60,000
టమోటా (వర్షాధారం)	33,000 – 36,000
టమోటా (నీటి ఆధారం)	80,000 – 90,000
మొక్కజొన్న (వర్షాధారం)	26,000 – 28,000
మొక్కజొన్న (నీటి ఆధారం)	42,000 – 45,000
చెరకు	70,000 – 74,000
జీడి	33,000 – 37,000
ఆయిల్ పామ్	35,000 – 40,500

రుణాలు సకాలంలో అందిస్తున్నారు



ఐదేళ్లుగా సకాలంలో రుణాలు అందించి రైతులను ఆదుకున్నారు. ప్రస్తుతం కూడా మేనేజర్ రైతులను పిలిచి వారికి కావలసిన రుణాలు అందిస్తున్నారు. పెంచిన రుణాల మొత్తాన్ని కూడా వివరిస్తున్నారు.

– వెంకటేశ్వర్లు, రైతు, మల్కాపురం

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు



రైతులకు రుణ పరపతి పెంచిన ప్రకారం, ఎల్‌డీఎం ఉత్తర్వులను అనుసరించి రుణాలు అందిస్తున్నాం. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి మళ్లీ రుణాలు తీసుకోవాలి. ప్రతి రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాం.

– ధర్మసాయి, కెనరా బ్యాంకు మేనేజర్, తాళ్లూరు

చెరువులు ఖాళీ

- జాడలేని వరుణుడు
- నీరు లేక బోసిపోతున్న చెరువులు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- మార్కాపురం ప్రాంతంలో మొత్తం 136 మైనర్ చెరువులు
- ఆసియాలోనే అతిపెద్ద కంభం చెరువు
- చెరువుల కింద 20 వేల ఎకరాల్లో పంటల సాగు

మార్కాపురం: రుతుపవనాలు వెనక్కి మళ్లడంతో వర్షాలు కురవక చెరువుల్లో నీరు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్ మొదటి వారంలోనే రుతుపవనాలు వచ్చి వర్షపు జల్లులు మాత్రమే పడ్డాయి. దీంతో చెరువుల్లో చుక్కనీరు లేదు. రైతులకు ఆసరాగా ఉండే చెరువులు అభివృద్ధికి నోచుకోక నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇటీవల కాలంలో చెరువులు పూడికతో నిండిపోయాయి. పూడిక తొలగించకపోవటంతో ఒకటి, రెండు వర్షాలకే చేరిన కొద్దిపాటి నీటికే చెరువులు నిండి తెగిపోతున్నాయి. దీనితో ఆయకట్టు చివరి దశకు వచ్చే సరికి నీరు అయిపోయి పంటలు ఎండిపోతున్నాయి. మార్కాపురం డివిజన్‌లో సుమారు 136 మైనర్ చెరువులు, ఆసియాలోనే అతిపెద్దదైన కంభం చెరువులు ఉన్నాయి. కంభం చెరువు కింద అధికారికంగా 6954 ఎకరాలు సాగవుతుండగా, మైనర్ చెరువుల కింద 44,434 ఎకరాలు సాగులో ఉన్నాయి. డివిజన్‌లో పెద్దారవీడులో 11, దొనకొండలో 38, తర్లుపాడులో 19, యర్రగొండపాలెంలో 27, పుల్లలచెరువులో 28, త్రిపురాంతకంలో 11, అర్ధవీడులో 23, బేస్తవారిపేటలో 21 చెరువులు ఉన్నాయి.

మార్కాపురం నియోజకవర్గంలో..

ఇందులో మార్కాపురంలో 27, తర్లుపాడులో 8, కొనకనమిట్లలో 9, పొదిలిలో 5 ఉన్నాయి. చెరువు పరిధిలో 100 ఎకరాలు కంటే తక్కువ ఆయకట్టు ఉంటే పంచాయతీ రాజ్ చెరువులుగా, 100 ఎకరాలపైబడి ఆయకట్టు భూమి ఉన్న చెరువులను మైనర్ ఇరిగేషన్ చెరువులుగా గుర్తిస్తుంటారు.

తర్లుపాడు మండలంలో పోతలపాడు, తుమ్మలచెరువు, గొల్లపల్లె గ్రామాల్లో నీటి పారుదల శాఖ పరిధిలో చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలో 1080 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. ఇవి కాక పంచాయతీ రాజ్ పరిధిలో మరో 20 కుంటలు ఉన్నాయి. ప్రభుత్వం చెరువుల మరమ్మతులకు నిధులు విడుదల చేస్తేనే మరమ్మతులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం చెరువుల్లో నీరు లేకపోవటంతో ఎడారులను తలపిస్తున్నాయి. కొనకనమిట్ల మండలంలోని తువ్వపాడు, వద్దిమడుగు, అంబాపురం, చినమనగుండం, చినారికట్ల పెరుమాళ్ల కిష్టమ్మ, వాగు



నీళ్లులేని తర్లుపాడు చెరువు



చుక్క నీరులేని వేములకోట చెరువు

మడుగు ముక్కు పాపయ్య, పెదారికట్ల పాపిరెడ్డి చెరువులు ఉన్నాయి. వర్షాకాలంలో భారీ వర్షాలు కురవకపోవటంతో చెరువులు బీడు భూములను తలపిస్తున్నాయి. దీంతో ఆయా చెరువుల ఆయకట్టు కింద భూములు సాగు చేసుకొనే రైతులు నిరుత్సాహానికి గురయ్యారు. ముందస్తు వర్షాలు కురిసి చెరువులకు నీరు వస్తే పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా ఉండేదని పలువురు రైతులు తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే తప్ప చెరువులకు పుష్కలంగా నీరొచ్చే పరిస్థితి లేదు. చెరువుల్లో నీరుంటే తువ్వపాడు చెరువు కింద 2019 ఎకరాలు, వద్దిమడుగు చెరువు 670 ఎకరాలు, చినారికట్ల పెరుమాళ్ల కిష్టమ్మ చెరువు 253 ఎకరాలు, అంబాపురం చెరువు 85 ఎకరాలు, వాగుమడుగు ముక్కు పాపయ్య చెరువు 226 ఎకరాలు, పెదారికట్ల పాపిరెడ్డి చెరువు 127 ఎకరాలు చొప్పున మొత్తం 3380 ఎకరాలు సాగుచేసుకోవటానికి అవకాశం ఉంటుంది.

ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం:

మార్కాపురం మండలంలోని ఏ ఒక్క చెరువులో నీళ్ల లేక అలంకార ప్రాయంగా ఉన్నాయి. మండలంలో 27 చెరువులు ఉన్నాయి. వీటిలో 19 పంచాయతీరాజ్, 8 మైనర్ ఇరిగేషన్ చెరువులున్నాయి. మార్కాపురం చెరువు కింద 1109 ఎకరాలు, మార్కాపురం చెరువు సప్లయ్ చానల్ కింద 907 ఎకరాలు, బోడపాడు బంధంబావి 170 ఎకరాలు, భూపతిపల్లె చెరువు 108, కోలభీముపాడు చెరువు 108, కొంగల వాగు 114, తిప్పాయపాలెం రిజర్వాయర్ 1192, బోడపాడు చెరువు 58, గొట్టిపడియ 179, గజ్జలకొండ చెరువు 70, వేములకోట చెరువు కింద 774 ఎకరాల ఆయకట్టు ఉంది.

చెరువులకు చేరని నీరు.. ఆశలొదిలిన రైతులు:

పొదిలి మండలంలో తరతరాలుగా రైతులకు ఇంత తిండి గింజలకు ఆదరువుగా ఉన్న చెరువులకు ఇటీవల కాలంలో కొద్ది నీరు కూడా చేరింది లేదు. అసలే చెరువులకు నీరు వచ్చేది ఎప్పటికో...అది కూడా పొలాలకు చేరకపోవటంతో రైతాంగం చెరువు ఆయకట్టుపై ఆశలు వదులుకుంటున్నారు. ఆక్రమణలకు గురైన కాలువలు రూపు కోల్పోయి ఇక్కడో కాలువ ఉండాలి... కనపడటం లేదు అనే స్థాయికి వెళ్లింది. ముసి రిజర్వాయర్ పరిధిలో సుమారు 1200, తీగదుర్తిపాడు, రామాపురం చెరువులకు సంబంధించి 1000 ఎకరాల్లో, పెద్ద చెరువు కింద 811.71, చిన్నచెరువు 238.54 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగు చేసేవారు. అనధికారికంగా మరో 2 వేల ఎకరాల్లో మాగాణి భూములు సాగు చేసేవారు. పదేళ్లుగా పొదిలికి సంబంధించి చెరువుల కింద సాగు క్రమేపీ తగ్గిపోతుంది. ప్రస్తుతానికి బోర్ల కిందనే ఆధారపడి గతంలోని మాగాణి భూములు సాగుచేసుకుంటున్నారే తప్ప చెరువుల్లోని నీరుపై ఎటువంటి ఆశలు లేవు.

పెద్దారవీడు మండలంలో..


పెద్దారవీడు మండలంలోని పెద్దారవీడు చెరువు కింద 195 ఎకరాలు, దేవరాజుగట్టు చెరువుకింద 114, సుంకేశుల 116, కలనూతల 559, తంగిరాలపల్లి 102, ఓబులక్కపల్లి 477, సానికవరం కోనప్పచెరువు కింద 102, వైడిపాడు చెరువు కింద 276, తీగలేరు సప్లై చానల్ కింద 107, చిన్నగుడిపాడు చెరువు కింద 324 ఎకరాలు సాగవుతాయి.

పెద్దదోర్నాల మండలంలో..

గంటవానిపల్లి రిజర్వాయరు కింద 840 ఎకరాలు, వై చెర్లోపల్లి తీగలేరు కింద 634 ఎకరాలు, కడపరాజుపల్లి చెరువుకింద 268 ఎకరాలు, తిమ్మాపురం చెరువు కింద 302 ఎకరాలు, చట్టుతాండ కింద 155 ఎకరాలు సాగులో ఉన్నాయి. అయితే ఈ ఏడాది వీటికి మరమ్మతులు చేపట్టకపోతే వర్షాలకు వచ్చేనీరు వృథాగా పోయే ప్రమాదముంది. ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



చుక్క నీరు లేని చినారికట్ల చెరువు



నీరులేని మార్కాపురం చెరువు

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- వైఎస్సార్ సీపీ కార్యాలయాలు కూల్చడం సరికాదు
- మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపి నాగార్జునరెడ్డి

మార్కాపురం: దయచేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అందరూ సహకరించాలని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం మార్కాపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకూ టీడీపీ ప్రభుత్వంలో కార్యాలయాల నిర్మాణానికి జారీచేసిన జీవోల ప్రకారమే టీడీపీ వారు ఎలా అయితే వారి పార్టీ కార్యాలయాలు కట్టారో అదే విధంగా వైఎస్సార్ సీపీ కార్యాలయాల నిర్మాణాలు కూడా జరిగాయని అన్నారు. 2019–2024 మధ్య అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆయా జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణాలను జీవోల ప్రకారమే కడుతోందన్నారు. ప్రజాస్వామ్యంలో వివిధ పార్టీల కార్యాలయాలు నిర్మించుకోవడం సహజమని, అయితే వైఎస్సార్ సీపీ కార్యాలయాలను కూల్చడం మంచి సాంప్రదాయం కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ హుందాగా వ్యవహరించాలని అన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రతిఒక్కరూ ప్రజాస్వామ్యంను కాపాడటంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పొగాకు వేలంలో గరిష్ట ధర రూ.358



పొదిలి వేలం కేంద్రంలో వేలానికి వచ్చిన పొగాకు బేళ్లు

ఒంగోలు సెంట్రల్: రీజియన్ పరిధిలో పొగాకు వేలంలో మంగళవారం మంచి ధరలు పలికాయి. గరిష్టంగా రూ.358 ధర వచ్చింది. మే 31న జరిగిన వేలంలో అత్యధికంగా కొనుగోలుదారులు కేజీ రూ.360కు కొనుగోలు చేయగా మళ్లీ జూన్ 25న రూ.358కి పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో మంగళవారం 7883 బేళ్లు రాగా, 7334 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేయగా, 549 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 89వ రోజు వేలంలో 4840 బేళ్లు రాగా, 4503 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 337 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్టంగా రూ.358, కనిష్టంగా రూ.205, సరాసరి రూ.304.23 వచ్చింది.

అదేవిధంగా మార్చి 6న ప్రారంభమైన డీసీపల్లి, కలిగిరి, కందుకూరు–2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 3043 బేళ్లు రాగా, 2831 బేళ్లు కొనుగోలయ్యాయి. 212 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.352, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.207.26 వచ్చింది.

విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఒంగోలు: విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి విద్యాశాఖ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి స్కూలు రికార్డులతోపాటు విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన జిల్లా విద్యాశాఖ అధికారి చాంబర్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, జూలై 12వ తేదీ నాటికి బడి ఈడు పిల్లలంతా బడిలో చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులందరికీ విద్యాకిట్ల పంపిణీ వందశాతం పూర్తిచేయాలన్నారు. విద్యార్థుల బేస్‌లైన్ టెస్టు గురించి, విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజన నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు అన్నింటిలో అడ్మిషన్లు పెరుగుతుండడాన్ని గుర్తించారు. ఎయిడెడ్ పాఠశాలల్లో నూతనంగా రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన అన్ని అంశాలను తాత్కాలికంగా ఆపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న దృష్ట్యా వాటిని ఆపాలని సూచించారు.

క్లుప్తంగా

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

గిద్దలూరు రూరల్: వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని దిగువమెట్ట సమీపంలోని నల్లమల అటవీప్రాంతంలో మంగళవారం వేకువజామున జరిగింది. మతిస్థిమితం లేని ఓ గుర్తుతెలియని వ్యక్తి రోడ్డుపై ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి సుమారు 40 నుంచి 50 ఏళ్ల వరకు ఉండవచ్చని, మతిస్థిమితం లేకుండా తిరుగుతుండే వ్యక్తిగా భావిస్తున్నారు.

కలెక్టర్‌కు సర్పంచ్‌ల సంఘం అభినందనలు


బదిలీపై వెళ్తున్న కలెక్టర్‌ను అభినందిస్తున్న సర్పంచుల సంఘం నాయకులు

ఒంగోలు అర్బన్: బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి ఇతర సంఘం నాయకులు మొక్కను అందచేసి అభినందనలు తెలిపారు. కలెక్టర్ తన పదవీకాలంలో గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి చూపిన చొరవ గానీ, విద్యార్థుల ఎదుగుదలకు చేసిన కృషి అనుసరణీయమని సంఘం నాయకులు కొనియాడారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తనదైన శైలిలో సమన్వయంతో పనిచేశారని కొనియాడారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు తాటిపర్తి వనజ, ఉపాధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేష్

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి బ్రిడ్జిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. లింగసముద్రం మండలం పెద్ద పవనికి గ్రామానికి చెందిన షేక్ రహ్మతుల్లా(25) తన బొలేరో వాహనంలో మిర్చి లోడు చేసుకుని గుంటూరు మిర్చి యార్డ్‌కు వెళ్తున్నాడు. వెల్లంపల్లి బ్రిడ్జిపైకి వచ్చే సమయంలో వాహనం ముందు టైరు పంచరైంది. టైరు మార్చుతున్న క్రమంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రహ్మతుల్లా ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై వి.మహేష్ పరిశీలించారు. అనంతరం హైవే పోలీసులకు సమాచారం ఇచ్చి తెల్లవారుజామున మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తర్లుపాడు వైస్ ఎంపీపీ-2 ఇంట్లో చోరీ

● నగదు, నగలు అపహరణ


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్, పక్కన ఎస్సై సుధాకర్

తర్లుపాడు: మండలంలోని నాగెళ్లముడుపు గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ-2 కందుల సుజాత ఇంట్లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంట శుభకార్యానికి హాజరయ్యారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని తర్లుపాడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై వేముల సుధాకర్ పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. రూ.75 వేల నగదు, బంగారు కమ్మలు, ఉంగరాలు, బ్రేస్‌లెట్ చోరీకి గురైనట్లు బాధితురాలు తెలిపారు. వైస్ ఎంపీపీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పొగాకు ధరల మోత

- రికార్డు ధరల మోతమోగిస్తున్న పొగాకు మార్కెట్
- ప్రస్తుతం కేజీ పొగాకు అత్యధిక ధర రూ.358 వరకు నమోదు
- రూ.254లుగా ఉన్న ప్రస్తుతం కేజీ పొగాకు సరాసరి ధరలు
- ఇప్పటి వరకు 81 మిలియన్ కేజీల అమ్మకాలు పూర్తి
- రైతుల వద్ద 58 మిలియన్ కేజీల వరకు పొగాకు
- ఇప్పటికే పలు వేలం కేంద్రాల్లో అధికారిక అమ్మకాలు పూర్తి
- అనధికారిక అమ్మకాలపై రాని స్పష్టత


పొగాకు బేళ్లు

కందుకూరు: ఈ ఏడాది పొగాకు మార్కెట్‌లో వర్జీనియా పొగాకు ధరలు మోత మోగిస్తున్నాయి. రికార్డు ధరలతో పొగాకు పంట రైతుల ఇంట సిరులు కురిపిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఏర్పడిన డిమాండ్‌తో మూడేళ్లుగా పొగాకు సాగు రైతులకు లాభదాయకంగా ఉన్నా ఈ ఏడాది మార్కెట్ ఊహించని స్థాయిలో రైతులకు లాభాలు తెచ్చిపెడుతోంది. దీనికి తోడు గత ప్రభుత్వం పొగాకు రైతులకు అనుకూలంగా పలు నిర్ణయాలు తీసుకోవడంతో ఆదాయాలు రెండింతలయ్యాయి. దీంతో రైతులు భారీగా పొగాకు సాగు చేశారు. దీనికి అనుగుణంగా ప్రస్తుతం వేలంలో పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదే సందర్భంలో ఇప్పటికే బోర్డు అనుమతించిన మేరకు అమ్మకాలు పూర్తి కావస్తుండగా, అనధికారిక అమ్మకాలపై బోర్డు ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో వేలం మరో రెండు నెలల పాటు సాగే అవకాశం ఉందని అధికారులు, రైతులు అంచనా వేస్తున్నారు.

81 మిలియన్ కేజీల అమ్మకాలు పూర్తి

గత రెండు సంవత్సరాలుగా పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉండడంతో పొగాకు సాగు విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం వేలంలో నమోదవుతున్న గణాంకాలే ఇందుకు నిదర్శనం. పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో 11 వేలం కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 2023-24 సీజన్‌కు సంబంధించి 88 మిలియన్ కేజీల పొగాను పండించుకునేందుకు బోర్డు అనుమతించింది. అయితే ఇప్పటికే 81 మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలు పూర్తయ్యాయి. అయితే బోర్డు అధికారుల అంచనా ప్రకారం 139 మిలియన్ కేజీల పొగాకును రైతులు పండించినట్లు అంచనా వేస్తున్నారు. అంటే ఇంకా రైతులు వద్ద దాదాపు 58 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తులు నిల్వ ఉన్నాయి. వాస్తవానికి బోర్డు అనుమతించిన మేరకు దాదాపుగా అమ్మకాలు పూర్తి కావచ్చాయి. కానీ అనధికారికంగా పండించిన పొగాకు రైతులు వద్ద భారీగా పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం జిల్లాలోని పలు కేంద్రాల్లో అనధికారిక పొగాకు అమ్మకాలు పూర్తయ్యాయి. వీటిలో కందుకూరు రెండో వేలం కేంద్రంలో 7.9 మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలకు అనుమతి ఉంటే ఇప్పటికే అమ్మకాలు పూర్తయ్యాయి. కానీ 13.5 మిలి యన్ కేజీల పొగాను పండించినట్లు అధికారులు అంచనా వేశారు. అలాగే కందుకూరు-1వ వేలం కేంద్రంలో 9.2 మిలియన్ కేజీల పొగాకును బోర్డు అనుమతి ఇస్తే ఇప్పటికే 8 మిలియన్ కేజీల వరకు అమ్మకాలు పూర్తయ్యాయి. ఈ వేలం కేంద్రంలో 15.5 మిలియన్ కేజీల వరకు రైతులు పంట పండించినట్లు భావిస్తున్నారు. మరోపక్క ఇప్పటికే మర్రిపాడు వేలం కేంద్రంలో అమ్మకాలు ముగిశాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కందుకూరులో రెండు, మర్రిపాడు, డీసీపల్లిలో వేలం కేంద్రాలు ఉండగా వీటి పరిధిలో అధికారిక అమ్మకాలు దాదాపు పూర్తి కావచ్చాయి. అనధికారిక పొగాకు అమ్మకాలపై పొగాకు బోర్డు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఆ అమ్మకాలు ఇంకా మొదలు కాలేదు.

కేజీ పొగాకు సరసరి ధర రూ.254

పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉండడంతో ఈ వేలంలో ఈ ఏడాది కేజీ పొగాకు రికార్డు ధర పలుకుతోంది. ఇప్పటి వరకు కేజీ పొగాకు అత్యధిక ధర రూ.358 నమోదు కావడం గమనార్హం. అంటే నాణ్యమైన పొగాకు క్వింటా రూ.35,800 ధర పలుకుతోంది. మొత్తం మీద చూస్తే అన్ని గ్రేడ్‌లు కలిపి కేజీ పొగాకు సరాసరి ధర రూ.254 రీజియన్ పరిధిలో నమోదైంది. అదే కందుకూరు వేలం కేంద్రాల్లో కేజీ పొగాకు సరాసరి ధర రూ.257ల వరకు వచ్చింది. అంటే నాణ్యతతో సంబంధం లేకుండా క్వింటా పొగాకు రూ 25,700 వరకు ధరలు వచ్చాయి. 2022-23 సీజన్‌లో ఇదే పొగాకు సరాసరి ధర రూ.214 వరకు ఉంది. అంటే ఈ ఏడాది సరాసరి ధర రూ.40 వరకు పెరుగుదల కనిపిస్తుంది. వేలం మరో రెండు నెలలు జరిగే అవకాశాలు ఉండడంతో ఈ ధరలు మరింత పెరుగుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అనధికారిక పొగాకుపై పెనాల్టీ రద్దు చేయాలి

ఇప్పటికే బోర్డు అనుమతించిన మేర పొగాకు అమ్మకాలు పూర్తి కావస్తుండగా అనధికారిక అమ్మకాలపై పొగాకు బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అనధికారిక పొగాకు అమ్మకాలపై గతంలో 5 శాతం పెనాల్టీని విధించేవారు. అయితే రైతుల విజ్ఞప్తి మేరకు 2022-23 సీజన్ అనధికారిక అమ్మకాలపై గత ప్రభుత్వ చొరవతో పొగాకు బోర్డు ఈ 5 శాతం పెనాల్టీని రద్దు చేసింది. అంటే అప్పటి వరకు అదనపు పొగాకును అమ్ముకోవాలంటే 5 శాతం పెనాల్టీ చొప్పున అంటే ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం క్వింటాకు రూ.2 వేల నుంచి రూ.2500 వరకు బోర్డుకు చెల్లించాల్సి వచ్చేది. దీన్ని రద్దు చేయడం వల్ల ఒక్కొక్క రైతుకు సరాసరిన రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు లబ్ధి జరిగింది. ఇక స్క్రాప్ (పొగాకు ముక్క)ను ఈ ఏడాది నేరుగా వేలం కేంద్రాల్లో అమ్ముకునేందుకు అవకాశం కల్పించింది. అయితే ఈ ఏడాది అనధికారిక పొగాకు అమ్మకాలపై బోర్డు ఇంత వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరి ఈ ఏడాది కూడా అనధికారిక పొగాకు అమ్మకాలపై ఉన్న పెనాల్టీని రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బోర్డు నిర్ణయంలో జాప్యం జరగడంతో అధికారిక పొగాకు అమ్మకాలు పూర్తయిన వేలం కేంద్రాల్లో ప్రస్తుతం అమ్మకాలు నిలిచిపోయాయి. దీంతో ఆయా కేంద్రాల్లో నేటి నుంచి స్క్రాప్ (పొగాకు చూర, ముక్క) వంటివి కొనుగోలు చేయనున్నారు. అనధికారిక పొగాకు కొనుగోళ్లపై బోర్డు నిర్ణయం వచ్చిన వెంటనే తదుపరి కొనుగోళ్లు చేపడతామని చెప్పారు.

బ్యారన్‌ల కోసం పోటాపోటీ

వరుసగా పొగాకు పంట రైతులకు కాసులు కురిపిస్తుండడంతో పొగాకుపై సాగుపై విపరీతమైన క్రేజ్ రైతుల్లో ప్రస్తుతం ఏర్పడింది. దీంతో తమకు ఉన్న పొలాలు, బ్యారన్‌లే కాక ఇతర బ్యారన్‌లు, పొలాలు కౌలుకు తీసుకునేందుకు రైతులు పోటీ పడుతున్నారు. దీంతో బ్యారన్, పొలాలు కౌలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. కందుకూరు ప్రాంతంలో అయితే గతేడాది రూ.1.50 లక్షలు ఉన్న బ్యారన్ కౌలు ప్రస్తుతం రూ.2.50 లక్షలకు చేరింది. అయినా బ్యారన్‌లు దక్కించుకునేందుకు రైతుల మధ్య విపరీతమైన పోటీ నెలకొంది. దీంతో అనధికారిక బ్యారన్‌లు ఇష్టం వచ్చినట్లు నిర్మించేస్తున్నారు. ఈ పరిస్థితి చూసి బోర్డు అధికారులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే సీజన్‌కు ఇప్పటి నుంచే అడ్వాన్స్‌లు ఇచ్చి బ్యారన్‌లు, పొలాలు కౌలుకు తీసుకుంటున్నారని, పొగాకు రికార్డు ధరలే ఇందుకు కారణమని భావిస్తున్నారు.

అధికారిక అమ్మకాలు పూర్తి కావచ్చాయి

ప్రస్తుతం బోర్డు అనుమతించిన మేరకు అధికారిక పొగాకు అమ్మకాలు పూర్తి కావచ్చాయి. ఇప్పటి వరకు నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 88 మిలియన్ కేజీలకు గాను 81 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తులు కొనుగోలు చేశాం. నేటి నుంచి పొగాకు ముక్క, చూర కొనుగోలు చేస్తాం. అనధికారిక పొగాకు కొనుగోళ్లపై బోర్డు నిర్ణయం వచ్చిన వెంటనే కొనుగోళ్లు ప్రారంభిస్తాం. మరో రెండు నెలల వరకు వేలం సాగే అవకాశం ఉంది.

– లక్ష్మణరావు, ఆర్‌ఎం, పొగాకు బోర్డు

ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

ఒంగోలు: ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అన్నారు. కక్షిదార్ల సౌకర్యార్థం దేశ వ్యాప్తంగా ఈనెల 29న శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, వీటిలో కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. రాజీకి అర్హత కలిగిన అన్ని క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా పరిహార చెల్లింపు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు ఇద్దరి ఆమోదంతో పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల్లో ఉన్నవారు కూడా ఉపయోగించుకుని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసుల్లో అప్పీల్‌కు వెళ్లే అవకాశం లేదని, కోర్టుల్లో చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి పొందవచ్చన్నారు. ప్రీ సిట్టింగ్ రూపంలో ఇరువర్గాల ఆమోదంతో ముందస్తుగా వ్యాజ్యాలు పరిష్కారానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంబంధిత న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు, న్యాయమూర్తులు సహకరిస్తారన్నారు. పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించాలన్నారు.

భారీగా అక్రమ మద్యం స్వాధీనం

● వీరేపల్లిలో 1077 క్వార్టర్లు, 126 బీర్లు సీజ్


స్వాధీనం చేసుకున్న మద్యంతో సెబ్ అధికారులు

దొనకొండ: అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను దర్శి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మండలంలోని సంగాపురం పంచాయతీ పరిధి వీరేపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. దర్శి ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.సుందరరామయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన విప్పర్ల బాలకోటయ్య తన పశువుల పాకలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో వీఆర్‌ఓ షేక్ హుస్సేన్, సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించామని తెలిపారు. 180 మి.లీ పరిమాణం గల 1077 మద్యం సీసాలు, 650 మి.లీ పరిమాణం గల 126 బీర్లు సీజ్ చేసినట్లు తెలిపారు. మద్యం సీసాల్లో 7 రకాల బ్రాండ్లు, బీర్లు రెండు రకాల బ్రాండ్లు ఉన్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు. దాడిలో దర్శి ఎస్‌ఈబీ ఎస్సై ఈ.కళ్యాణ్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సంరక్షణలో బాధ్యతగా వ్యవహరించాలి

● జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ రామాంజనేయులు


ఉత్తర్వులు అందిస్తున్న జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ రామాంజనేయులు, డీపీఓ బాల ప్రభాకర్

ఒంగోలు సెంట్రల్: బాలల సంరక్షణలో మరింత బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ వి.రామాంజనేయులు అన్నారు. డీపీఓ కార్యాలయంలో మంగళవారం బాలల సంక్షేమ, సంస్కరణలు, సేవలు, వీధి బాలల సంక్షేమం వారి సహకారంలో జేజే యాక్ట్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు నిర్వహించేందుకు కలెక్టర్ ఉత్తర్వులు పొడిగించారు. ఈ సందర్భంగా డీపీఓ కార్యాలయంలో నిర్వాహకులకు ఉత్తర్వులు అందించారు. జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ వి.రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో 20 ప్రభుత్వ, ప్రభుత్వేతర వసతి గృహాలకు గాను 13 వసతి గృహాలకు పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. డీపీఓ డి.బాల ప్రభాకర్, జిల్లా పర్యవేక్షణ అధికారి శేఖర్‌బాబు పాల్గొన్నారు.

యూపీ యువకుడి దారుణహత్య

- ఒంగోలులో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- పొట్ట కూటికి వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్న వైనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ (క్రైమ్) శ్రీధర్‌రావు


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శ్రీధర్‌రావు, పక్కన డీఎస్పీ కిశోర్ బాబు, సీఐ జగదీష్

ఒంగోలు టౌన్: పనుల కోసం వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్నాడు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఒక యువకుడు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ (క్రైం) శ్రీధర్ రావు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వినీత్ శ్రీవాస్తవ(26) రెండు రోజుల క్రితం అత్యంత దారుణంగా హత్యకు గురయ్యాడు. శ్రీవాస్తవ హైదరాబాద్‌లో పీఓపీ పనులు చేస్తుంటాడు. అక్కడ పనులు లేకపోవడంతో 20 రోజుల క్రితం ఒంగోలు వచ్చాడు. గత 20 ఏళ్లుగా ఒంగోలులో పీఓపీ పనులు చేయిస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికే చెందిన పీఓపీ మేస్త్రీ ధ్రువ్‌చంద్రవర్మ వద్ద పనికి చేరాడు. ఈ నెల 23వ తేదీన మేస్త్రీ వద్దకు వెళ్లి తన సోదరుడి వివాహం ఉందని, రూ.10 వేల అడ్వాన్స్‌గా ఇవ్వమని కోరాడు. అయితే పనిలో చేరి నెల కూడా కాలేదు, అప్పుడే అడ్వాన్స్ ఇవ్వడం కుదరదని ఆయన తిరస్కరించడంతో శ్రీవాస్తవ వివాదానికి దిగాడు. 'గతంలో ముంబైలో పనిచేసే సమయంలో రెండు హత్యలు చేశా, ఇప్పుడు నిన్ను మర్డర్ చేయడం నాకు పెద్ద విషయం కాద'ని ధ్రువ్‌ను హెచ్చరించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణలో ధ్రువ్ కింద పడిపోవడంతో అవమానంగా భావించాడు. ధ్రువ్ తన వద్ద పనిచేసే రాంచరణ్‌తో కలిసి శ్రీవాస్తవను హత్య చేయాలని పథకం పన్నాడు. అదే రోజు రాత్రి 12.30 గంటల సమయంలో నగర శివారులోని ఓ వెంచర్ వద్ద అమ్మాయిలు ఉంటారని చెప్పి నమ్మించి ముంగమూరు రోడ్డులోని ఒక వెంచర్ వద్దకు తీసుకెళ్లారు. 'నిన్ను చంపేందుకే తీసుకొచ్చామ'ని చెప్పి వెంట తెచ్చుకున్న కత్తితో అతడి పొట్టలో పొడిచారు. కిందపడిపోయిన అతడి మీద పడి గొంతు కోసి కిరాతకంగా హత్య చేశారు. శ్రీవాస్తవ చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత అతడి మృతదేహాన్ని సమీపంలోని కాలువలో పడేసి బైకు మీద వెళ్లిపోయారు. సోమవారం రాత్రి ఈ ఘటన వెలుగుచూసింది. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ కిశోర్ బాబు సిబ్బందితో కలిసి హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు తప్పించుకోకుండా వెంటనే అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో ఒంగోలు డీఎస్పీ కిశోర్‌బాబు పర్యవేక్షణలో టూ టౌన్ సీఐ జగదీష్, తాలుకా ఎస్సై విజయ కుమార్‌తో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించారు.

మంగళవారం ఒంగోలు రైల్వే స్టేషన్ వద్ద ఉన్న నిందితులను అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తి, మోటారు బైకును స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసును ఛేదించడానికి కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ అభినందించారు.

బండలాగుడు పోటీల్లో కడప ఎడ్ల సత్తా


బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్


రాజంపల్లిలో బండలాగుతున్న ఎడ్లు

కంభం: మండలంలోని ఔరంగబాదులో పట్టాభిరామస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లికి చెందిన మార్తాల వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు 4435 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. ఆ తర్వాత నంద్యాల జిల్లా బండి ఆత్మకూరుకు చెందిన చాగంటి నాగమల్లికార్జునరెడ్డి ఎడ్లు 3700 అడుగులు లాగి ద్వితీయస్థానం, కంభం మండలం సూరేపల్లికి చెందిన బిజ్జం వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు 3657 అడుగులు లాగి తృతీయ స్థానం, నంద్యాలకు చెందిన బల్లి కాశయ్య ఎడ్లు 3410 అడుగులు లాగి నాల్గవస్థానం, రాచర్ల మండలం అక్కపల్లికి చెందిన బత్తుల శేఖర్ ఎడ్లు 3000 అడుగులు లాగి ఐదవస్థానం, కంభం మండలం ఎల్‌కోటకు చెందిన ఉలవల హరిక్రిష్ణ ఎడ్లు 2508 అడుగులు లాగి ఆరోస్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతుల కింద రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.4వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, మండల కన్వీనర్ గొంటి చెన్నారెడ్డి, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, వరికుంట్ల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామ సమీపంలో వెలసిన పుణ్యక్షేత్రం గొంగ్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తెలుగు రాష్ట్రాల స్థాయి న్యూకేటగిరి విభాగంలో ఎడ్ల పోటీలు మంగళవారం హోరాహోరీగా సాగాయి. ముండ్లమూరు మండలం గంగనపాలెం గ్రామానికి చెందిన ఉమ్మారెడ్డి శ్రీవల్లి ఎడ్ల జత 3400 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా పొద్దుటూరు మండలం రంగసాయిపల్లి గ్రామానికి చెందిన మార్తాల సుబ్బారెడ్డి ఎడ్లజత 3200 అడుగులు లాగి రెండో స్థానంలో, కంభం మండలం దర్గా గ్రామానికి చెందిన లాయర్ కృష్ణయాదవ ఎడ్లజత 3015 అడుగులు లాగి మూడో స్థానంలో, కొమరోలు మండలం యడమకల్లు గ్రామానికి చెందిన నుసుం వెంకటేశ్వర్లు ఎడ్ల జత 1476 అడుగులు లాగి నాల్గవ స్థానంలో, పెద్దదోర్నాల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన నాగపొగు యోహాన్ ఎడ్లజత 600 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ. 50 వేలు కుందురు వెంకటరెడ్డి, మల్లికార్జునరెడ్డి, రెండో బహుమతి రూ.30 వేలు వెన్నా శ్రీధర్‌రెడ్డి, మూడో బహుమతి రూ.20 వేలు జిల్లెల అంకిరెడ్డి, గంగిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నాల్గవ బహుమతి రూ.15 వేలు దుగ్గెంపుడి మల్లారెడ్డి, ఐదో బహుమతి రూ.10 వేలు వెన్నా పెద్దమల్లారెడ్డిలు గెలుపొందిన ఎడ్ల యజమానులకు అందజేశారు. పోటీలో పాల్గొన్న ఎడ్ల యజమానులకు శాలువా, పూలమాలతో కమిటీ సభ్యులు సన్మానించారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యారు. న్యాయనిర్ణేతలు వెన్నా బోడిరెడ్డి, డి.వెంకటేశ్వరరెడ్డి, టి.సుధాకరరెడ్డి, బి.వెంకటేశ్వరరెడ్డి, జి.సత్యనారాయణరెడ్డి, యాంకర్ వల్లెల వెంకటరామిరెడ్డి వ్యవహరించారు.